క్లుప్తంగా

మురపాకలో పారిశుద్ధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో ఉన్న చెత్తాచెదారాలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గ్రామ పెద్ద పెయ్యిల లక్ష్మణ రావు పర్యవేక్షించారు.

రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న త్రినాథస్వామి

గార: ఈ నెల మూడో తేదీలోగా రైతులు ఈకే వైసీని పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయా ధికారి కె.త్రినాథస్వామి అన్నారు. బూరవెల్లి, పూసర్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటలను సాగు చేస్తున్న రైతులందరూ విధిగా ఈకేవైసీని పూర్తి చేసుకోవాలన్నారు. వరిలో సమగ్ర పురుగుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ టి.భవానీశంకర్, ఏవో డి.పద్మావతి పాల్గొన్నారు.

21 మంది ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన అంపోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

గార: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంపోలు, కొర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికవ్వడంపై ఎంపీపీ గొండు రఘురామ్ అభినందనలు తెలియజేశారు. అంపోలు జెడ్పీ నుంచి బాక్సింగ్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, మోడ్రన్ పెంథలాన్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం జ్యోతి లక్ష్మీనారాయణ తెలిపారు. పీడీలు టి.శ్రీనివాసరావు, ఎల్. సీతారామరాజులను అభినందించారు. అలాగే కొర్ని జెడ్పీ నుంచి స్విమ్మింగ్‌లో మనోజ్, వి.మూర్తి, ముద్దపు మహేష్, బాస్కెట్ బాల్‌కు ప్రగడ హర్షలు ఎంపికయ్యారని హెచ్‌ఎం వై.వాసుదేవరావు, పీఈటీ ఎస్‌వీ రమణ తెలిపారు.

ఔత్సాహిక రైతుల నమోదు రేపు

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల మూడో తేదీన నారాయణ తిరుమలలో ఔత్సాహిక రైతుల పేర్లు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్‌లివింగ్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలోని చెగూర్‌లో జరిగే పది రోజుల శిక్షణ తరగతులలో పాల్గొనేందుకు ఈ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 86394 56848, 94411 80393 నంబర్లను సంప్రదించాలి.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రణస్థలం: కొచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి వివిధ కేటగిరిలో ఎంపికయ్యారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బి.రేవతి (వాలీబాల్), బి.మోహన్ (క్రికెట్), జె.భవాని, కె.విమల, కె.భూలక్ష్మి (ఖో-ఖో) పోటీల్లో ఎంపికైనట్లు పాఠశాల పీఈటీలు ఎం.వి.రమణ, పైల సత్యవతి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఎం కిల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రో బాల్‌లో..

ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు మండలం కేజీబీవీకి చెందిన ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది విద్యార్థిని డి.శాంతి త్రో బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి -19 స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఈ విద్యార్థిని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళాయె..



ముస్తాబైన పాతబ్రిడ్జి వద్దగల దుర్గాదేవి ఆలయం



దుర్గాదేవి అమ్మవారు

- రేపటి నుంచి ప్రారంభం
- ముస్తాబైన మండపాలు

శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే మండపాలను సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీకాకుళం పట్టణంలోని ఏడురోడ్ల కూడలిలో జయదుర్గా, డే అండ్ నైట్ కూడలిలో నవదుర్గా టాక్సీస్టాండ్ల ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే ఏపీ హెచ్‌బీ కాలనీలో, టౌన్‌హాలులో రజస్థానీ మిలన్ ఆధ్వర్యంలో కూడా ఉత్సవాలు జరగనున్నాయి.

ఆలయాల్లో..

పట్టణంలోని పలు ఆలయాల్లో కూడా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో, పాత బ్రిడ్జి వద్దగల కనక దుర్గాదేవి ఆలయం, పెద్దబరాటంవీధిలో వెలసిన నీలమ్మతల్లి ఆలయంలో, పీఎన్‌కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో, కాకివీధిలో వెలసిన ముత్యాలమ్మ తల్లి ఆలయంలో, నానుబాలవీధిలోని విజయదుర్గా అమ్మవారి ఆలయంలో, బలగలోని బాలత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో, నక్కవీధిలోగల ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో, గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే భవానీ మాలధారణలు, మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. భక్తులు కుంకుమ పూజలు చేసుకోవడానికి అనుకూలంగా మండపాలు, శక్తిపీఠాల్లో ఏర్పాట్లు చేశారు.

మందులు అందుబాటులో ఉండాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎచ్చెర్ల ఎంపీపీ, ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సలహా మండలి అధ్యక్షుడు మొదలవలస చిరంజీవి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య సేవలు, వైద్య పరీక్షలపై సమీక్షించారు. వైద్యాధికారులు గంగా ప్రియదర్శిణి, ఉషశ్రీ మాట్లాడుతూ రోజూ 40 నుంచి 80 వరకు ఓపీ ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఎనిమిది డెలివరీలు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో పిల్లల వ్యాక్సినేషన్, ప్రభుత్వ కార్యక్రమాలు మెరుగ్గా నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాబిస్ వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా కుక్క కాటు బాధితులు పీహెచ్‌సీకి వస్తున్నారన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ, మలేరియా వంటి పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. సలహా మండలి సభ్యులు దుంప చిన్నారెడ్డి, తండ్యాన లక్ష్మణరావు, సర్పంచ్ ముద్దాడ శంకర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మండల స్థాయి చెకుముకి పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలకు 25 మంది ఎంపికయ్యారని తెల్సుకుని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు అండర్ 14, 17 విభాగాల్లో 19 మంది, టేబుల్ టెన్నిస్‌లో ఐదుగురు, వాలీబాల్‌లో ఒకరు ఎంపికయ్యారు. హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కళాశాలల ఎంబీఏ విద్యార్థులు శ్రీకాకుళం పట్టణంలోని సన్‌డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన గ్రాహ్య మేనేజ్‌మెంట్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. బిజినెస్ క్విజ్ తదితర అంశాల్లో మెరుగైన ప్రదర్శన చేశారు. విద్యార్థులను కళాశాలలో మంగళవారం ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.సూర్యం, ఫ్యాకల్టీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలి



నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని పీడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కూర్మారావు, శ్యామ్, కాళీ ఏఐవైఎఫ్ నాయకులు వసంతరావు, నరేష్, కిరణ్ ఉన్నారు.

ప్రతి ఇంట్లో రక్తదాత ఉండాలి



మానవహారంలో విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతీఇంట్లో రక్తదాత ఉండాలని.. అప్పుడే రక్తం కొరత తీరుతోందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపు నిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారాన్ని మంగళవారం చేపటాటరు. ఈ సందర్భంగా రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ముందుగా రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని అడిషనల్ డీఎంహెచ్‌వో శ్రీకాంత్, డీపీఎం ఆదిలింగంతో కలసి ప్రారంభించారు. ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల, టైలరింగ్ సెంటర్, న్యూసెంట్రల్ స్కూల్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, ఏవో నర్సింగరావు, సుగుణాకరరావు, సతీష్‌కుమార్, ఎం.కల్యాణ్‌చక్రవర్తి, బి.చిన్మయరావు, పెంకి చైతన్యకుమార్, గొలివి రమణ పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఉండాలి



వృద్ధులకు పండ్లను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వృద్ధులకు అండగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఖ్యాతి వృద్ధాశ్రమంలోని ఉంటున్న వారికి పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సామాజిక అవసరం గురించి న్యాయమూర్తి వివరించారు. వారి అనుభవాలు తరువాత తరాలకు పాఠాలని అన్నారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. వృద్ధులకు ప్రభుత్వం అందించే పింఛన్లు, ఉచిత వైద్యంపై చర్చించారు. జి.ఇందిరప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్ పాల్గొన్నారు.

యోగాలో రాణించిన మహిళా కానిస్టేబుల్



శిరీషను అభినందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.శిరీష జాతీయస్థాయి యోగా పోటీలో పతిభకనబర్చారు. చండీగడ్‌లోని భిలాయి పట్టణంలో జరిగిన ఆలిండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ మహిళా విభాగం పోటీల్లో పాల్గొన్న ఆమె కాంస్య పతకం సాధించారు. దీంతో శిరీషను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. డీఎస్పీ వివేకానంద, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాష్ట్రపోటీలకు పయనం



రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్, రమణ, సాంబ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సమష్టిగా తుది వరకు పోరాడి విజేతలై తిరిగిరావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఏలూరు వేదికగా ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా జట్లు మంగళవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లాయి. వీరికి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వద్ద అధికారులు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు వీడ్కోలు పలికి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ జిల్లా నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, మెట్ట తిరుపతిరావు, వెటరన్ అంతర్జాతీయ అథ్లెట్ పాలకొండ అప్పారావు, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

జి.సిగడాం: భగవద్గీత మానవ జీవితసారమని కేజీబీవీ ప్రిన్సిపాల్ దాసరి ఉషారత్నకుమారి అన్నారు. తిరుపతి తిరుమల దేవస్థానం సరఫరా చేసిన భగవద్గీత పుస్తకాలను 283 మంది విద్యార్థులకు మంగళవారం అందించారు. భగవద్గీత మహోన్నతంగా తీర్చిదిద్దే గ్రంథమన్నారు. నైతిక విలువలతో కూడిన జీవితాన్ని కానుకగా ఇచ్చే గ్రంథమని వెల్లడించారు. టీటీడీ జిల్లా ధర్మ ప్రచార మేనేజర్ ఎం.లలితామణి, తెలుగు అధ్యాపకురాలు లలితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు

గార: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం ముడపడి ఉందని జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్ అన్నారు. కె.మత్స్యలేశం బీచ్‌లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛతా ఉద్యమంలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత, స్థానిక నాయకుడు ఎర్రన్న, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డు-2024 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా ఎయిడెడ్, ప్రైవేటు అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 13వ తేదీన అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు అర్హతల సర్టిఫికెట్లతోపాటు అనుభవం తెలిపే సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్‌లను దరఖాస్తుకి జతచేసి ఈ నెల ఐదో తేదీలోగా ఆల్‌దిబెస్ట్ అకాడమి, డోర్ నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు పంపించాలని కోరారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి అన్నారు. కళాశాల ఆడిటోరియంలో మంగళవారం మొదటి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలున్న విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ప్రతీ విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్‌పై పట్టు, విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేనేజ్‌మెంట్ సభ్యులు ఇప్పిలి కిశోర్, బెండి రఘు కార్తీక్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, విభాగాధిపతులు డి.తిరుమలరావు, బాలభాస్కరరావు, ఆర్.సూర్య నారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు

శ్రీకాకుళం అర్బన్: హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ అభ్యర్థులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తీసుకున్న వారు భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ నెల నాలుగో వారంలో 17వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం 79897 23505, 73829 23293 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, పీఆర్వో కె.సుమన్ ఉన్నారు.

స్వచ్ఛతకు పెద్దపీట



ర్యాలీ నిర్వహిస్తున్న ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు



కుప్పిలి సముద్రం ఒడ్డును శుభ్రం చేసిన శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



బొంతలకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యా సంస్థల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు విద్యాసంస్థ నుంచి ఎచ్చెర్ల వరకు ర్యాలీ నిర్వహించారు. చిలకపాలెంకు చెందిన శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కుప్పిలి బీచ్‌లో చెత్తను సేకరించారు. బొంతలకోడూరులో పారిశుద్ధ్యం-పచ్చదనం కార్యక్రమంపై చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. లావేరు మండలం బుడుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి వెల్లడించారు. రాజమండ్రి వేదికగా ఈనెల 4 నుంచి 6 వరకు జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి అండర్-14,16,18,20 వయో విభాగాల్లో 74 మంది వరకు బాలబాలికలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు సామాజిక మాధ్యమాల ద్వారా వర్తమానం పంపించామని, పీడీలు, పీఈటీలు చొరవ తీసుకుని ఎంపికైన క్రీడాకారులకు విషయాన్ని చేరవేయాలని సూచించారు. రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటలకు శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ వద్దకు తమ లగేజీతోపాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 3పాస్‌ఫొటోలతో హాజరుకావాలని మధుసూదన్, సాంబమూర్తి సూచించారు. మరిన్ని వివరాలకు 8500271575(సాంబమూర్తి)ని సంప్రదించాలని వారు కోరారు.

మాంసం విక్రయిస్తే చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మాంసం, చేపల విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పి.వి.వి.డి ప్రసాదరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాంసం, చేపల దుకాణాలు, జంతు వధశాలలో ఎటువంటి వ్యాపారాలు చేయరాదని స్పష్టం చేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం

9912220343

Office mail : sklmadvt@gmail.com